ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
బుధవారం 8 జనవరి 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.136	220	240
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 27.0 । కనిష్ఠం 15.8

నిలిచిన 'రేషన్' రవాణా

- హమాలీ కార్మికుల సమ్మెతో ఆటంకం
- జిల్లాలో 250మంది సివిల్ సప్లయ్ హమాలీలు
- ప్రత్యామ్నాయ మార్గాల్లో బియ్యాన్ని సరఫరా చేయిస్తున్న అధికారులు

హమాలీ కార్మికుల సమ్మెతో జిల్లాలో రేషన్ సరుకుల రవాణా నిలిచిపోయింది. గతంలో ఒప్పందం మేరకు కూలీ రేట్లు పెంచాలని ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద పనిచేసే సివిల్‌సప్లయ్ హమాలీలు వారం రోజులుగా సమ్మె చేస్తున్నారు. దీంతో రేషన్‌దుకాణాలు, విద్యాసంస్థలకు ప్రతి నెలా అందజేయాల్సిన బియ్యం రవాణా నిలిచింది. దీంతో సరుకుల రవాణాకు ప్రత్యామ్నాయ మార్గాలను అధికారులు ఆశ్రయిస్తున్నారు. మంగళవారం నుంచి ప్రైవేట్ వ్యక్తుల ద్వారా బియ్యం సరఫరాను తాత్కాలికంగా చేయిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట(కలెక్టరేట్)



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న హమాలీలు


ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి మండల లెవల్ స్టాక్(ఎంఎల్ఎస్) పాయింట్ల ద్వారా విడతల వారీగా రేషన్ దుకాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ వసతిగృహాలు, ప్రభుత్వ విద్యాసంస్థలకు బియ్యం సరఫరా అవుతోంది. అయితే ప్రస్తుతానికి విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు,వసతిగృహాల్లో నిల్వ ఉన్న బియ్యంతో అన్నం వండిపెడుతున్నారు. నిల్వ ఉన్న బియ్యం కూడా అయిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. త్వరలో సంక్రాంతి సెలవులు రానున్నప్పటికీ అప్పటివరకు కూడా నిల్వ ఉన్న బియ్యం సరిపోయేలా లేవు.

వారం రోజులుగా సమ్మెలో హమాలీలు

సివిల్ సప్లయ్ విభాగంలో పనిచేస్తున్న హమాలీ కార్మికులు వారం రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి సమ్మెలో ఉన్నారు. ప్రతి రెండేళ్లకోసారి కూలీ రేట్లు పెంచుతున్నారు. అందులో భాగంగా గత ఏడాది అక్టోబరులో కూలీ రేట్లు పెంచే విషయమై సివిల్ సప్లయ్ శాఖ ఉన్నతాధికారులు..

- మిగతా 8వ పేజీలో...

అతని పేరు చెబితే.. హడల్!



అతని పేరు చెబితే వ్యవసాయశాఖ ఉద్యోగులు, అధికారులు ఉలిక్కిపడుతున్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే ఏఈవోలు మొదలుకొని డివిజన్, జిల్లాస్థాయి ఉద్యోగులు, అధికారులే కాదు కమిషనరేట్‌లో పనిచేసే ఉద్యోగులు సైతం అతని పేరు చెబితే వణికిపోతున్నారు. సమాచార హక్కు చట్టాన్ని అడ్డంపెట్టుకొని దరఖాస్తులు పెట్టిస్తూ, భారీగా వసూళ్లకు పాల్పడుతున్నాడని సదరు ఉద్యోగులు, అధికారులు వాపోతున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

- ఆర్టీఐ దరఖాస్తుల పేరుతో వసూళ్లు
- సమాచారం వెల్లడించకుండా సెటిల్‌మెంట్లకు తెగబడుతున్న అక్రమార్కులు
- కట్టడి చేయాలని వేడుకుంటున్న ఉద్యోగులు

సమాచార హక్కుచట్టం కింద తమని ఏ సమాచారమడిగినా ఇస్తామని, అవతవకలకు పాల్పడితే వెల్లడి చేయవచ్చని వ్యవసాయ శాఖలోని అధికారులు పేర్కొంటున్నారు. అదే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవచ్చని, కానీ సదరు వ్యక్తి మాత్రం దరఖాస్తులు పెట్టించి ఆతర్వాత ఉపసంహరించుకుంటానని, సెటిల్‌మెంట్లు చేసుకోవాలని రాయబారాలు చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారని ఉద్యోగులు, అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయాన్ని బహిరంగంగా చెప్పుకోలేకపోతున్నామని, అలాగని అతను ఆశించినరీతిలో ముడుపులు కూడా ఇవ్వలేకపోతున్నామని బాధపడుతున్నారు. నల్లగొండ జిల్లాలో ఒక రాజకీయపార్టీలో సామాన్యకార్యకర్తగా కొనసాగే ఈ వ్యక్తి సాగిస్తున్న బెదిరింపుల దందాతో వ్యవసాయశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులకు తలనొప్పిగా మారింది.

నల్లగొండ జిల్లాకి చెందిన.. రాజధానికి సమీపంలో ఉండే ఒక మండల ఏవో, ఏఈవోలు రైతుబీమా క్లెయిమ్ విషయంలో తప్పుడు డాక్యుమెంట్లు నమోదు చేశారని వారిపై సమాచారహక్కుచట్టం కింద దరఖాస్తు పెట్టించిన ఈ వ్యక్తి వారితో మధ్యవర్తి ద్వారా రాజీ కుదుర్చుకుని, మధ్యవర్తి ద్వారానే రూ.లక్ష వసూలు చేశారని పేర్కొంటున్నారు.



ఏడీఏకి ముప్పుతిప్పలు

ఉమ్మడి జిల్లాకు చెందిన ఒక ఏడీఏని బెదిరింపులకు పాల్పడుతున్న ఈ వ్యక్తి.. అతను పనిచేసిన అన్ని డివిజన్లలో పనిచేసిన కాలమంతటికీ సంబంధించిన సమస్త వివరాలు అడుగుతాడు. ఏడీ, ఏవోల వాహన అలవెన్స్‌లు, ట్రావెలింగ్ బిల్లులు, కార్ల బిల్లులు, మీటర్ రీడింగులు, సంబంధిత డివిజన్లలోని ఏఈవోలు, ఏవోలు, ఇతర సిబ్బంది సంబంధించిన సర్టిఫికెట్ల జీరాక్స్‌లు, సంబంధిత అధికారి తాను పనిచేసిన చోట్ల ఎవరెవరికి ఎలాంటి మెమోలు, నోటీసులిచ్చారనే అంశాలతో సహా ఆయా డివిజన్లలో పనిచేసిన అధికారులందరి వేతనాలు, జీతభత్యాలు, హెచ్ఆర్ వివరాలు, హౌసింగ్ లోన్ల వివరాల వంటి వ్యక్తిగత విషయాలను సైతం దరఖాస్తుల్లో పేర్కొంటూ మానసిక వేదనకు గురి చేస్తున్నారని సదరు అధికారులు, ఉద్యోగులు వాపోతున్నారు. రైతుబంధు లిస్టులు, పీఎంకేపై జాబితాలు, అప్‌లోడ్ వివరాలు, రిజెక్ట్ చేసిన వివరాలు, కారణాలు తెలపాలని కోరుతున్నారని, ఇదంతా..

-మిగతా 7వ పేజీలో...

దరఖాస్తు పెట్టడం, ముడుపుల బేరం కుదుర్చుకోవడం

నల్లగొండ జిల్లాలో ఒక ప్రధాన పట్టణానికి చెందిన ఈ వ్యక్తి ఒక రాజకీయపార్టీలో కార్యకర్తగానూ కొనసాగుతున్నాడు. వ్యవసాయశాఖలో ఒకరిద్దరు ఏఈవోలతో స్నేహంగా ఉంటూ ఆశాఖలో జరిగే రోజువారీ కార్యక్రమాలపై అవగాహన పెంచుకొని, ఆ అవగాహననే తన అక్రమ సంపాదనకు సాధనంగా వినియోగించుకుంటున్నాడు. ఏఈవోలు, ఏవోలు, ఏడీఏలు, సీనియర్‌అసిస్టెంట్ల వరకు పెద్దసంఖ్యలో ఇతని బాధితులున్నారు. తొలుత బాధితులపై సమాచార హక్కుచట్టం ద్వారా ఉద్యోగ ఉల్లంఘన, అవకతవకలున్నాయంటూ వాటి వివరాలు తెలియజేయాలని కోరుతూ సమాచార హక్కు చట్టం కింద తనకు సంబంధించిన వ్యక్తులతో దరఖాస్తు చేయిస్తారని ఆరోపణలున్నాయి. ఆతర్వాత శాఖలో తనకు సన్నిహితంగా ఉండేవారి ద్వారా సదరు బాధితులకు రాయబారం పంపి, తనతో సెటిల్‌మెంట్ చేసుకుంటే, దరఖాస్తుని ఉపసంహరింపజేస్తానని చెబుతూ వారిని ఒత్తిళ్లకు లోనుచేసి రూ.40వేల నుంచి రూ.1లక్ష వరకు వసూలు చేస్తున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. ఇతను, ఇతని బృందం సమాచారహక్కుచట్టం కింద దరఖాస్తులు పెట్టడమే తప్ప ఆ సమాచారం తీసుకొని అవకతవకలపై ఒక్క సమాచారం కూడా వెల్లడి చేయలేదని, కేవలం దరఖాస్తుల ద్వారా బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు వసూలు చేయడానికే ఆర్‌టీఐ కింద దరఖాస్తు చేస్తున్నారని ఉద్యోగులు వాపోతున్నారు.

మునిసిపాలిటీలకు కాసుల వరద

- నిధుల వినియోగానికి పాలకవర్గాలకు 18 రోజులే అవకాశం
- సూర్యాపేటకు రూ.26.34, కోదాడ రూ.18.76, తిరుమలగిరికి రూ.1.62, నేరేడుచర్లకు రూ.1.60, హుజూర్ నగర్‌కు రూ.3.63 కోట్లు



6

సాగర్ డ్యామ్‌పై గుంతల పూడ్చివేతకు చర్యలు

- సాగర్ నియోజకవర్గంలోని ప్రాజెక్టులపై అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష
- హాజరైన సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి
- నెల్లికల్లు ఎత్తిపోతల టెండర్ల ప్రక్రియ పూర్తికి ఆదేశాలు


7



ఎడ్ల బండిని నేను..

తన మనుగడ కనుమరుగవుతున్న వేళ స్వగతాన్ని వివరిస్తూ, రైతుకూ, పల్లెకూ తన వల్ల జరిగిన ఉపయోగాన్ని వివరిస్తోందీ ఎడ్లబండి. సాగులో యాంత్రీకరణ పెరుగుతుండటంతో తాను ఓ జ్ఞాపకం కాబోతున్నాననే ఆవేదనకు అక్షర రూపం 6వ పేజీలో

అనుమతి లేని ఆస్పత్రులపై చర్యలు



ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో కోటాచలం

సూర్యాపేటఅర్బన్,జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రులు అనుమతులు లేకుండా నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో కోటా చలం అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసి, మాట్లాడారు. శిక్షణ పొందిన సిబ్బందితో మాత్రమే సేవలు నిర్వహించాలన్నారు. తగిన సర్టిఫికెట్లు పొందిన వారు ఉండాలన్నారు. బయోమెడికల్ వేస్టేజ్, పొల్యూషన్‌బోర్డు సర్టిఫికెట్,ఫైర్ ట్రీట్‌మెంట్, ధరల పట్టిక ఖచ్చితంగా ఉండి తీరాలన్నారు. ఆసుపత్రుల అనుమతి పత్రాలను రెన్యూవల్ చేసుకోవాలని లేకుంటే శాఖపరమైన జరిమానా విధిస్తామన్నారు. ప్రైవేట్ ఆ సుపత్రుల్లో మెనేజింగ్ డైరెక్టర్, సిబ్బంది ఏ ఒక్కరు మారినా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అనుమతి పొందాలన్నారు. కార్యక్రమంలో మనోహరరాణి పాల్గొన్నారు.

వేగంగా సాగుతున్న దర్గా పనులు

పాలకవీడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : జాన్‌పహాడ్ దర్గా సమీపంలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ నెల 23 నుంచి 25వ తేదీవరకు దర్గా ఉర్సు ఉత్సవాలు ఉండటంతో ఆప్రాంత అభివృద్ధికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ.కోటి మంజూరు చేయించారు. ఆయా నిధులతో చేపట్టిన పనులు మంత్రి ఉత్తమ్ ఆదేశాలతో చకచకా సాగుతున్నాయి. పంచాయతీరాజ్ ఈఈ వెంకటయ్య మంగళవారం పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యతతో పనులు చేయాలని ఆదేశించారు. మరుగుదొడ్లు, షెడ్ల నిర్మాణం కొరకు కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎన్‌వీ సుబ్బారావు, మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్, నాయకులు మోతీలాల్, ఏఈ ప్రదీప్, నాగయ్య, శ్రీకాంత్, శేషు, ప్రేమ్‌కుమార్, రాణి, పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలి


తిరుమలగిరి కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేలు, పక్కన కలెక్టర్

తిరుమలగిరి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటి పరిధిలో జరుగుతున్న పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే మందుల సామేలు, కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్ ఆదేశించారు. మంగళవారం తిరుమలగిరి మునిసిపల్ కార్యాలయంలో అధికారులు, కౌన్సిలర్లుతో ఏర్పాటుచేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. మునిసిపాలిటీలో వివిధ పథకాల ద్వారా జరగుతున్న పనుల పురోగతిని వారు సమీక్షించారు. ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, వైస్‌చైర్మన్ కేశిడి సరళ, కమిషనర్ మణి కరణ్, తహసీల్దార్ హరి ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలి

విద్యార్థులు మంచిగా చదివి సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్ తెలిపారు. మంగళవారం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలోని ఉన్నత పాఠశాలను తనిఖీచేశారు. తరగతి గదిలోకి వెళ్లి 9వ తరగతి విద్యార్థుల నోట్‌బుక్స్ పరిశీలించారు, తెలుగు పాఠం చదవమని కోరగా విద్యార్థులు చక్కగా చదవడంతో మెచ్చుకున్నారు. పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా స్టడీ అవర్స్ ఏర్పాటు చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించి, పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం సరిగా పెడుతున్నారా అని ఆరా తీశారు. పాఠశాలలో ఏమైనా సమస్యలుంటే చెప్పాలన్నారు. కలెక్టర్ వెంట ఎంఈవో శాంతయ్య, ప్రధానోపాధ్యాయుడు దామెర శ్రీనివాస్ తదితరులున్నారు.

బాలల హక్కులను గౌరవించాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ పీ శ్రీవాణి

సూర్యాపేట లీగల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : వయోజనులకే కాదు, బాలలకు కూడా హక్కులు ఉంటాయని వాటిని గౌరవించినప్పుడే బాలల వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ పీ శ్రీవాణి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్థానిక రాంకోటితండాలోని చార్లెట్ అనాథశ్రమంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యాహక్కు లాంటి పిల్లల హక్కులను గౌరవించినప్పుడే పిల్లల భవిష్యత్ తరాలకు ఆశాజనకంగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డప్పుకు మల్లయ్య, వసంత సత్యనారాయణపిళ్ళె, పెండెం వాణి, బొల్లెద్దు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

సాగునీటిని విడుదల చేయాలి


కొమ్మాల గ్రామంలో శ్రీరాంసాగర్ ఉపకాల్వలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

అర్వపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంసాగర్ రెండోదశ ఆయకట్టుకు 1,500 క్యూసెక్కుల నీటిని వెంటనే విడుదల చేసి ఉపకాల్వకు నీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాల గ్రామానికి చెందిన రైతులు వినూత్నంగా శ్రీరాంసాగర్ ఉపకాల్వలో కూర్చోని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల చివరి ఆయకట్టు భూములకు నీరు అందజేయాలని కోరారు.కాల్వలను వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. పంట పొలాలకు సాగు నీటిని అందజేసి రైతులను కాపాడాలని కోరారు. తూములు తీసి చెరువులను నింపాలన్నారు. కార్యక్రమంలో రైతులు శ్రీను, అలివేలు, శంకర్, జనార్దన్, రాములు, ఉపేందర్, గంగరాజు, ఉప్పలయ్య,శ్రీధర్, రాకేష్,లింగయ్య,గిరి, శ్రీకాంత్, బద్రి, చందు పాల్గొన్నారు.

రెండే గ్రామాలకు నీరు...


పెన్‌పహాడ్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : వారబందీ పద్ధతిలో విడుదలవుతున్న ఎస్సారెస్పీ నీరు ఎట్టకేలకు మంగళవారం పెన్‌పహాడ్ మండలానికి చేరుకున్నాయి. అయితే నీటి విడుదల సామర్థ్యం తక్కువగా ఉండటంతో ధర్మాపురం నుంచి మేగ్యాతండా వరకు మాత్రమే నీరు చేరింది. ఆ తర్వాత ఉన్న ఆయకట్టు ఎనిమిది గ్రామాలకు నీటి సరఫరా అయ్యే అవకాశం కనిపించడం లేదు. జనవరి 1వ తేదీ నుంచి మార్చి 24వ తేదీ వరకు వారబందీ పద్ధతిలో నీటిని విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీ ఆయకట్టు కింద మండలంలో ఎస్సారెస్పీ కాల్వ కింద 13,562 ఎకరాల్లో వరి సాగు కావాల్సి ఉంది. అయితే ప్రభుత్వం వారబంధీ పద్ధతిలో నీటిని విడుదల చేయడంతో చివరి భూములకు సకాలంలో నీరు చేరలేదు. దీంతో నార్లు పోసుకుని దుక్కులు దున్నుకొని సిద్ధంగా ఉన్నారు.వారబందీ కారణంగా పోసుకున్న నార్లన్నీ ఎండిపోతున్నాయి. సాగునీటి కోసం ఎదురవుతున్న రైతాంగానికి నిరాశ ఎదురైంది. ఈ విషయమై ఎస్సారెస్పీ నీటి పారుదల సహాయ నిర్వహణ అధికారి లింగయ్యను వివరణకోరగా రబీలో వారబందీ నీరు ఇస్తామని ముందే చెప్పాం. పైనుంచి గోదావరి నీరు రాకపోవడంతో చేసేది ఏమీలేదన్నారు.

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి


జూనియర్ కళాశాలలో అధ్యాపకులతో మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ బోర్డు జాయింట్ సెక్రటరీ భీంసింగ్, పక్కన జిల్లా అధికారి భానునాయక్

భానుపురి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఇంటర్మీడియట్ బోర్డు జాయింట్ సెక్రటరీ భీంసింగ్ అన్నారు. మంగళవారం సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. రికార్డులను, హాజరుపట్టికలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. 90 రోజుల ప్రణాళికను అమలు చేసి ఉత్తీర్ణత శాతం పెంచాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలను బలోపేతం చేయాలన్నారు. అధ్యాపకుల సూచనలను పాటిస్తూ విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తీర్ణత శాతం పెంచాలన్నారు. జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని కాంక్షించారు. ముందుగా కళాశాల రికార్డులను, టీచింగ్ డైరీలను, హాజరుపట్టికలను పరిశీలించారు. ఆయన వెంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు పెరూమాళ్ల యాదయ్య, జిల్లా అధికారి భానునాయక్, అధ్యాపకులు వీడీఎస్ ప్రసాద్, వాసు, సైదులు, నిరంజన్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

సూర్యాపేట(కలెక్టరేట్), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లకు ప్రభుత్వం కనీస వేతనాలు అమలుచేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ వర్కర్లు చేపట్టిన ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ వర్కర్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలన్నారు. నెలకు కనీస వేతనం రూ.26వేలు అందజేయాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్ల పెండింగ్ వేతనాలు, కేంద్రాల అద్దె, గ్యాస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. అద్దె భవనాల్లో సరైన సౌకర్యాలు లేవని ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ రాంబాబుకు అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దంతాల రాంబాబు, గుగులోత్ రాజారాం, అంగన్‌వాడీ వర్కర్లు రమ, శోభారాణి, మంజుల, అంజలి, సునంద, అండాలు, నవనీత, భాగ్యమ్మ, సుమిత్రాదేవి, సరస్వతి, హరిత పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లిక్

ఆహారం కోసం విహారం

● ఆహారం వేటలో వ్యవసాయ క్షేత్రాలు, నీటి వనరుల వద్ద పక్షుల సందడి ● వీటిరాకతో ప్రకృతికి కొత్త అందాలు


చెట్టు పైనుంచి చూపు


చెరువులో ఉంటూ వేట


● అద్భుతం గిజిగాడి గూడు

మనుగడ కోసం సృష్టిలో ఏ జీవికైనా ఆహారం అత్యవసరం. అందుకు పశుపక్ష్యాదులకు వేట అనివార్యం.. ఆకలి తీరే మార్గంలో పక్షులు ఎన్నో మైళ్లు, తీరాలను దాటి వస్తుంటాయి. వాటికి సరైన ఆహారం లభించే చోట కొన్ని గంటల పాటు వేచి ఉండి ఆ తర్వాత గూళ్లకు చేరుతుంటాయి. ఇలా ఉదయాస్తమ వేళల్లో పక్షులు పొలాలు, నీటి వనరులైన చెరువులు, కుంటల్లో చేరి ఆహారాన్ని, నీటిలోని కీటకాలను భుజిస్తూ కాలం వెళ్లదీస్తాయి. సాయంత్రం అరుణ వర్ణకాంతులు ఆకాశాన్ని వీడుతున్న వేళ గూటికి చేరుతుంటాయి..ఈ దృశ్యాలు అందరినీ ఆకర్షిస్తుంటాయి.. నల్లగొండ సమీపంలోని పలుప్రాంతాల్లో తీసిన చిత్రాల సమాహారం ఇది...

(స్టాఫ్‌ఫొటోగ్రాఫర్-ఆంధ్రజ్యోతి, నల్లగొండ)


స్వయంకృషి


సహపంక్తి


సహవాసం


సాయంకాలం ఇంటి బాట


నెమ్మానిలో రోడ్డు పక్కన ఉన్న చెట్ల నరికివేత

పచ్చని చెట్లు నరికివేత

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుండటంతో పచ్చని చెట్లను నరికేస్తున్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి నుంచి అమ్మనబోలుకు వెళ్లే దారిలో నెమ్మాని వద్ద రోడ్డు పక్కగా గతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో హరితహారం కింద మొక్కలను నాటారు. అయితే విద్యుత్ సరఫరా లైన్ కింద మొక్కలు నాటగా, కొన్నేళ్లకు ఏపుగా పెరిగి చెట్లుగా ఎదిగాయి. అయితే చెట్ల కొమ్మలు తగిలి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ట్రాన్స్‌కో సిబ్బంది ఆ చెట్లను జంగిల్ కటింగ్ పేరిట తొలగించారు. అనాలోచితంగా చేపట్టిన పనులతో పచ్చని చెట్లు నరికివేతకు గురికావాల్సి రావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.




ఎడ్లబండిని నేను..

● గత కాలపు వైభవానికి చిహ్నాన్ని
● రైతుకు నేస్తాన్ని, ఇంటి సభ్యుడిని
● యాంత్రీకరణ ఇరుసులో కనుమరుగవుతున్న రైతు వాహనాన్ని

నేను మీ ఎద్దుల బండిని. రైతుకు నేస్తాన్ని. కష్ట సుఖాల్లో రైతు వెంటే ఉండేవాడిని. పొలంగట్ల నుంచి మొదలు ఎరువులు, సరుకులు తెచ్చేందుకు పల్లె, పట్నం దాకా నాతోనే రైతు ప్రయాణం సాగేది. ఒకప్పుడు రైతు కుటుంబంలో నేనూ ఒకడిని. గ్రామాల్లో ప్రతీ పనికి నా అవసరం ఉండేది. పెళ్లికి, పబ్బానికీ నాపైనే వెళ్లేవారు. రహదారి వెళ్లలేని చోటుకీ నేను తీసుకెళ్లేదానిని. శాస్త్ర సాంకేతిక రంగాలు పురోగతిని సాధించడంతో వేగానికి ప్రాధాన్యం పెరిగింది. వ్యవసాయంలో యాంత్రీకరణ మొదలై నా స్థానంలో ట్రాక్టర్ వచ్చి చేరింది. వ్యవసాయంలో నా అవసరం క్రమేణా తగ్గింది. ఎద్దులను సాకటం, వాటికి గ్రాసాన్ని సమకూర్చటం ఆధునిక రైతులకు కష్టమైంది. నేడు నా మీద ఆధార పడే రైతులు చాలా అరుదనే చెప్పుకోవాలి. అక్కడక్కడ నేను కనిపిస్తున్నా, పాత కాలం నాటి నాస్వరూపం మారిపోయింది. కలప చక్రాల స్థానంలో టైర్లు, ఇనుప చక్రాలు వచ్చాయి. ఇవికూడా ఎక్కువ సంఖ్యలో కాకుండా ఏదో ఒక గ్రామంలో ఒకటోరెండో కనిపిస్తున్నాయి. పల్లెలో అక్కడక్కడ రైతుల ఇళ్ల ముందు శిథిలమై మూలన పడిఉన్న చక్రాలు, బండిఇరుసు, గడగొయ్యలు, తొట్టికట్టెలు వంటి పరికరాలు నా గత చరితకు సాక్షీభూతంగా కనిపిస్తున్నాయి. గ్రామాల్లో ఎడ్లబండి తయారు చేసే చేతివృత్తులవారు పనుల్లేక ఇతర పనులు చేసుకుంటున్నారు. 20 ఏళ్ల కిందట గ్రామీణ ప్రాంతాల్లో చిన్న చిన్న సరుకుల రవాణాకు నన్ను ఉపయోగించేవారు. రైతులు తమ పంట పొలాల్లో వ్యవసాయ పనుల్లో విరివిగా వినియోగించేవారు. ప్రతీ గ్రామంలో పండుగలకు మాతో నిర్వహించే ఊరేగింపులు సందడిగా ఉండేవి. ఆపద సమయంలో రోడ్డులేని మారుమూల గ్రామాల్లో ముఖ్య ప్రయాణ సాధనంగా నన్నే ఉపయోగించుకునే వారు. వ్యవసాయ పనుల్లో రైతులు




రాజాపేట మండలం పుట్టగూడెంలో వినియోగంలో లేక శిథిలమవుతున్న ఎడ్లబండి

పండించిన పంట ఉత్పత్తులను మార్కెట్‌కు ఇంటికి తరలించడంలో మా భూమిక ఎంతో ఉండేది. యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండం పుట్టగూడెంలో రెండేళ్ల కిత్రం వరకూ ఇంటికో బండి ఉండేది. కానీ నేడు ఆ బండ్లు కనిపించడం లేదు. ఇకపై మేము ఓ జ్ఞాపకంగా మిగిలిపోనున్నాము. కొత్త తరం వారికి ఎండ్లబండి అంటే ఏంటో ఎట్లుండో కూడా తెలియదు. కాలానికి అనుగుణంగా ఎన్నో మార్పులు చోటు చేసుకోవటం సహజం. రైతులకు, పల్లె సీమలకు మాతో విడదీయని బంధం ఉంది.

ఇట్లు.. మీ ఎడ్లబండి

(ఆంధ్రజ్యోతి-రాజాపేట, కనగల్)

మునిసిపాలిటీలకు కాసుల వరద

● ఐదేళ్ల పెండింగ్ నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
● ఉమ్మడి జిల్లాలోని 20 మునిసిపల్ ఖాతాల్లోకి రూ.125.60 కోట్లు

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

ప్రస్తుత మునిసిపల్ కౌన్సిళ్ల గడువు మరో 18రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో మునిసిపాలిటీలకు కాసుల వరద పారింది. 2019 నుంచి రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా లభించిన స్టాంప్ డ్యూటీని ప్రభుత్వం ఈ నెల 3న మునిసిపల్ జనరల్ ఫండ్ ఖాతాల్లో జమచేసింది. స్టాంప్ డ్యూటీ విడుదలను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిలిపివేయగా నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా ఐదేళ్ల స్టాంప్ డ్యూటీని రాష్ట్రంలోని 144 కార్పొరేషన్లు, మునిసిపాలిటీలకు సుమారు రూ.5,725 కోట్లను ఒకే దఫాలో విడుదల చేసింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని 20 మునిసిపాలిటీలకు ఐదేళ్ల స్టాంప్ డ్యూటీ పేరిట రూ.125,60,82,347 ఆదాయం సమకూరింది.

అత్యధికంగా నల్లగొండ మునిసిపాలిటీకి రూ.28,38,31,549, అత్యల్పంగా నందికొండకు కేవలం రూ.77,360 మాత్రమే స్టాంప్ డ్యూటీ ఆదాయం లభించింది. అయితే రాష్ట్రంలో కార్పొరేషన్లలో అత్యధికంగా జీహెచ్ఎంసీకి ఏకంగా సుమారు రూ.3వేల కోట్ల పైబడి, మునిసిపాలిటీలలో అత్యధికంగా నార్సింగికి రూ.281 కోట్లు, మణికొండకు రూ.231 కోట్లు జమ య్యాయి. దీంతో మునిసిపల్ జనరల్ ఖాతాలు కాసులతో గలగలమంటున్నాయి.



పట్టణాల్లోని స్థిరాస్తి క్రయవిక్రయాల సందర్భంగా రిజిస్ట్రేషన్ శాఖ 7.5 స్టాంప్ డ్యూటీని వసూలు చేస్తోంది. ఆ మొత్తం నుంచి స్థానిక సంస్థలకు స్టాంప్ డ్యూటీగా 5.5 శాతం, ట్రాన్స్‌ఫర్ డ్యూటీగా 1.5శాతం, రిజిస్ట్రేషన్ ఫీజుగా 0.5 శాతంగా పరిగణిస్తారు. ప్రతి రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ చెల్లించిన వెంటనే రిజిస్ట్రేషన్ శాఖ ఖాతాలో జమవుతుంది. అక్కడి నుంచి నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ఆయా స్థానిక సంస్థల ఖాతాలకు చేరుతుంది. ఇదే విధానం గ్రామపంచాయతీలకు కూడా వర్తిస్తుంది. రియల్‌ఎస్టేట్‌కు అవకాశం ఉన్న మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో స్థిరాస్తుల క్రయవిక్రయాలు జోరుగా ఉండటంతో అంతే మొత్తంలో ఆయా పట్టణాలకు, గ్రామాలకు స్టాంప్ డ్యూటీ పేరిట భారీ ఆదాయం సమకూరుతోంది. ప్రజలు చెల్లించిన స్టాంప్ డ్యూటీ మునిసిపల్ జనరల్ ఖాతాలలో జమవుతుంది. ఆ నిధులతో స్థానిక అవసరాల మేరకు అభివృద్ధి పనులను చేపట్టే అధికారి ఆయా స్థానికసంస్థలకు ఉంటుంది. ఈ ఆదాయంలో ప్రభుత్వ వాటా నయా పైసా కూడా ఉండదు. అయితే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయం కారణంగా 2019 నుంచి స్టాంప్ డ్యూటీ ఆదాయాన్ని స్థానిక సంస్థలకు చెల్లించడం నిలిచిపోయింది. ఆ నిధులను అప్పటి ప్రభుత్వం ఇతర అవసరాలకు వినియోగించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. స్టాంప్ డ్యూటీ విడుదల కోసం పలు ఆందోళనలు జరిగినప్పటికీ ఫలితం మాత్రం లభించలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత మునిసిపల్ కౌన్సిళ్ల గడువు జనవరి 26తో ముగియనున్న నేపథ్యంలో అనూహ్యంగా ఐదేళ్ల స్టాంప్ డ్యూటీని ఒకే పర్యాయం మునిసిపల్ ఖాతాల్లో జమ చేయడం గమనార్హం. అయితే గ్రామపంచాయతీల పెండింగ్ స్టాంప్ డ్యూటీని కూడా వెంటనే విడుదల చేయాలని డిమాండ్లు వస్తున్నాయి.

ఖజానా కళకళ

పట్టణాల ప్రజలు వివిధ రూపేనా చెల్లించే పన్నులతో మునిసిపాలిటీకి ఆదాయం లభిస్తుంది. పన్నుల వసూళ్లన్నీ మునిసిపల్ జనరల్ ఖాతాలో జమవుతాయి. ప్రభుత్వాలు జారీ చేసే గ్రాంట్లు ప్రత్యేక ఖాతాల్లో జమచేస్తుంటారు. జనరల్ ఖాతా నుంచి విద్యుత్ చార్జీలు, నీటి కొనుగోలు చార్జీలు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు, శానిటరీ, ఇతర అభివృద్ధి పనులను చేపడుతుంటారు. జనరల్ ఫండ్ వినియోగంపై మునిసిపల్ కౌన్సిల్‌దే సర్వాధికారం. ఇదిలా ఉండగా కౌన్సిల్ గడువు 3 వారాల్లో ముగియనుండడంతో స్టాంప్ డ్యూటీ పేరిట వచ్చిన ఆదాయంతో అభివృద్ధి పనులు చేపట్టే అవకాశాలు అంతంతగానే ఉన్నట్లు తెలుస్తోంది. కౌన్సిల్ గడువు ముగిసిన అనంతరం మునిసిపాలిటీ వారీగా ప్రభుత్వం నియమించే ప్రత్యేక అధికారి అనుమతులతో పనులను చేపట్టాల్సి ఉంటుంది. అయితే కౌన్సిల్ గడువు ముగిసే లోపు ఒక్కో కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగనుండడంతో స్టాంప్ డ్యూటీ నిధులతో నూతన పనులను తమ హయాంలోనే ప్రతిపాదించాలని పార్టీలకతీతంగా కౌన్సిలర్లు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం.

మునిసిపాలిటీ	స్టాంప్‌డ్యూటీ ఆదాయం
నల్లగొండ	రూ.28,38,31,549
సూర్యాపేట	రూ.26,34,49,060
భువనగిరి	రూ.24,39,60,317
కోదాడ	రూ.18,76,31,383
మిర్యాలగూడ	రూ.14,82,47,108
చౌటుప్పల్	రూ.11,96,89,758
పోచంపల్లి	రూ.4,07,43,250
హుజూర్‌నగర్	రూ.3,63,71,752
ఆలేరు	రూ.3,58,45,763
యాదగిరిగుట్ట	రూ.3,10,91,810
దేవరకొండ	రూ.2,30,90,193
హాలియా	రూ.2,20,96,559
నకిరేకల్	రూ.2,11,16,975
తిరుమలగిరి	రూ.1,62,95,918
చిట్యాల	రూ.1,60,68,090
నేరెడుచర్ల	రూ.1,60,36,954
మోత్కూరు	రూ.1,52,57,314
చండూరు	రూ.89,54,324
నందికొండ	రూ.77,360
మొత్తం	రూ.125,60,82,347

ఖరారు కాని మార్గదర్శకాలు

స్టాంప్ డ్యూటీ నిధుల వినియోగంపై ప్రభుత్వం మార్గదర్శకాలను ఖరారు చేయలేదని తెలుస్తోంది. కానీ నిధులను విడుదల చేసిన ఈ నెల 3న కమిషనర్లకు అందిన ఉత్తర్వుల ప్రకారం ఈ నిధుల నుంచి మొదటగా పెండింగ్ విద్యుత్ చార్జీలు, వేతనాలు, జీఎస్టీ, కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాల్సి ఉంటుంది. దీంతో మునిసిపాలిటీలలో పేరుకుపోయిన బకాయి విద్యుత్ చార్జీలు వసూలు కానుండడంతో ట్రాన్స్‌కోకు ఆదాయం సమకూరనుండగా కార్మికులకు పెండింగ్ వేతనాలు లభించనున్నాయి. అలాగే పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపు కూడా పూర్తి కానుండడంతో కార్మికులకు ఆందోళన తప్పనుంది.

యువకుడి ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రం బీసీ కాలనీలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం గుణమోని శ్రీశైలం(20) పూల వ్యాన్‌పై కూలీగా పనిచేస్తుంటాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. అనంతరం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మిర్యాలగూడ అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని కృష్ణమానస కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 5వ తేదీన పందిరి వేణు ఇంటికి తాళం వేసి తన కుటుంబసభ్యులతో కలిసి తిరుపతి దేవదర్శనం కోసం వెళ్లాడు. మంగళవారం ఉదయం తిరుపతి నుంచి ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు ఇంటితాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించి ఆందోళన చెందారు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా చోరీ జరిగినట్లు భావించి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో రూరల్ ఎస్ఐ లోకేష్‌కుమార్ తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. సుమారు 15 తులాల బంగారు నగలతో పాటు కొంత నగదు చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు తెలిపారు. చోరికి గురైన సొత్తు విలువ సుమారు రూ.11 లక్షలకుపైగా ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. వేణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

వేములపల్లిలోనూ...

వేములపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలో తాళం వేసిన ఇంట్లో చోరీ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పోల కల్పన ఈ నెల 2న తన తల్లి గ్రామమైన మహబూబ్‌నగర్ జిల్లా చాడబండ గ్రామానికి వెళ్లింది. తిరిగి మంగళవారం మధ్యాహ్నం ఇంటికి చేరుకుని తలుపులు తీసి ఇంట్లోకి వెళ్లగా చోరీ జరిగినట్లు గమనించింది. సుమారు మూడు తులాల చంద్రహారం, తులం బంగారు ఉంగరాలు, 7 గ్రాముల చెవిదిద్దులతో పాటు బీరువాలోని రూ.38వేల నగదు చోరికి గురైనట్లు గుర్తించింది. సొత్తు విలువ సుమారు రూ.4 లక్షల వరకు ఉంటుందని బాధితురాలుతెలిపింది. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కల్పన తెలిపారు.

రూ.20 లక్షల విలువైన ఐరన్ పైపులు...

చౌటుప్పల్ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటం శివారులో ఓ పరిశ్రమకు చెందిన ఐరన్ నీటి పైపులు చోరీకి గురయ్యాయి. ఎస్ఐ కృష్ణమల్లు తెలిపిన వివరాల ప్రకారం వలిగొండ మండలం గోకారం నుంచి చౌటుప్పల్‌లోని దివీస్ పరిశ్రమకు నీటి సరఫరా కోసం ఐరన్ పైపులు ఎస్.లింగోటం శివారులో నిల్వచేశారు. గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి క్రేన్ సాయంతో వాటిని లారీల్లో తరలించారు. 115పైపులు చోరీకి గురైనట్లు దివీస్ ప్రతినిధి పోలీసులకు ఫిర్యాదుచేశారు. పైపుల విలువ దాదాపు రూ.20లక్షలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి రిమాండ్

వలిగొండ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : గంజాయిని తరలిస్తున్న నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం రామన్నపేట మండలం తుమ్మలగూడెం గ్రామానికి చెందిన కుంచం విజయ్‌కుమార్, వలిగొండ మండలానికి చెందిన సిరిగిరి బోయజ్‌లు సోమవారం ద్విచక్ర వాహనంపై చిట్యాల నుంచి వలిగొండ వైపుకు వస్తున్నారు. అయితే రామన్నపేటలో వాహనాలు తనిఖీ చేయగా పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 3,760 గ్రాముల గంజాయి లభ్యమైంది. అదే రోజువారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణ చేపట్టగా మరో ఇద్దరు ఉన్నట్లు గుర్తించారు. వలిగొండ మండలం టేకుల సోమారం గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్‌ను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు తప్పించుకు తిరుగుతున్నాడని ఎస్ఐ తెలిపారు. గంజాయిని తరలించినా, విక్రయించినా చట్టప్రకారం శిక్షలు తప్పవని, కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

సాగర్ డ్యామ్‌పై గుంతల పూడ్చివేతకు చర్యలు

- భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష
- పాల్గొన్న మాజీ మంత్రి జానారెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పక్కన మాజీ మంత్రి జానారెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, అధికారులు

హాలియా,నాగార్జునసాగర్ జనవరి7 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ డ్యామ్ మీద పడిన గుంతలను పూడ్చివేతకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సాగర్ నియోజకవర్గ పరిధిలోని నెల్లికల్లు ఎత్తిపోతల పథకంతో సహా హైలెవల్, లో లెవల్, లింక్ కెనాల్‌తో పాటు సాగర్‌డ్యామ్ మీద పడిన గుంతల పూడ్చివేతపై స్థానిక జలసౌధలో మంగళవారం మంత్రి నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డ్యామ్‌పై గుంతల పూడ్చివేతకు ఐఐటీ రూర్కీ ఆధ్వర్యంలో అధ్యయనం చేయించాలని సూచించారు.

నెల్లికల్లు ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తి చేయాలి

నాగార్జునసాగర్ జలాశయం నుంచి నీటిని అందించే నెల్లికల్లు ఎత్తిపోతల పథకం పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. రూ.664.80 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే 24,624 ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు. యాసంగి సీజన్ నాటికి మొదటి దశ పూర్తయితే 7,600 ఎకరాలకు నీరందించవచ్చన్నారు. అంతే కాకుండా హైలెవల్, లోలెవల్ కెనాల్‌ల మధ్యలో చేపట్టిన లింక్ కెనాల్ పనులను వేగం పెంచాలన్నారు. 15 కిలో మీటర్ల పరిధిలో 62.26 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన ఈకాల్వల నిర్మాణం కోసం కావాల్సిన 65.02 ఎకరాలకు ఇప్పటికే 43.31 ఎకరాల భూమిని సేకరించినట్లు ఆయన తెలిపారు. త్వరగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి పనులు ప్రారంభించాలన్నారు.

చివరి భూములకు నీరు అందేలా..

చివరి భూములకు నీరు అందేలా ఏఎంమ్మార్పీ, ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టుల పరిధిలోని 90.43 కిలోమీటర్ల మేర కాల్వలను రూ.42.26 కోట్లతో 60 మిల్లీమీటర్ల మేర కాంక్రీట్ లైనింగ్‌తో మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని ఐడీసీ ఎత్తిపోతల పథకాలలో ఎక్కువ భాగం పనిచేయడం లేదని, పనిచేయని వాటిని గుర్తించి మరమ్మతులకు అయ్యే వ్యయం తాలూకా అంచనాలు రూపొందించిన సత్వరమే పునరుద్ధరించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అనుముల చెక్ డ్యాం నిర్మాణానికి పాలనాపరమైన అనుమతులు మంజూరు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కుందూరు జానారెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, నీటి పారుదలశాఖ ముఖ్యకార్యదర్శి బొజ్జా రాహుల్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఈఎన్‌సీ అనిల్‌కుమార్, ఈఎన్‌సీఎం విజయ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ ఈఎన్‌సీ శ్రీనివాస్, నల్లగొండ ఎస్ఈ అజయ్‌కుమార్, సీఈ శ్రీధర్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం

మన అధికారి
MANA ADHIKARI

- పోలీస్ వ్యవస్థపై ప్రజలకు మరింత విశ్వాసం కల్పిస్తా
- సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలకు వెళ్లాలనుకుంటున్న యువతకు నావంతు సహకారం అందిస్తా
- భువనగిరి ఏసీపీ, ఐపీఎస్ అధికారి రాహుల్‌రెడ్డి



భువనగిరి టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పోలీస్ వ్యవస్థపై ప్రజలకు మరింత విశ్వాసం కల్పిస్తానని భువనగిరి ఏసీపీ కంకనాల రాహుల్ రెడ్డి అన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితులకు న్యాయంచేయడం, సమాజానికి చేటుగా మారుతున్న సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతామని చెప్పారు. ఐపీఎస్ శిక్షణ పూర్తయ్యాక భువనగిరి ఏసీపీగా మొదటి పోస్టింగ్‌లో చేరిన 27 ఏళ్ల యువ ఐపీఎస్ అధికారి రాహుల్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్న అభిప్రాయాలు ఆయన మాటల్లోనే..

కుటుంబ నేపథ్యం

మా స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గొర్లవీడు గ్రామం. వ్యాపారరీత్యా మా తల్లిదండ్రులు కంకణాల దేవేందర్‌రెడ్డి, అరుణ కొన్నేళ్ల క్రితమే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లిలో స్థిరపడ్డారు. సోదరి ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. భార్య గౌతమి ఐఎఎస్ అధికారి.

విద్యాభ్యాసం

ప్రాథమిక, కళాశాల విద్య, హైదరాబాద్‌లోనే కొనసాగింది. ఇబ్రహీంపట్నంలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 2018లో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాను. మొదటి ప్రయత్నంలో సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ క్వాలిఫై అయి ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. ద్వితీయ ప్రయత్నంలో 218వ ర్యాంక్‌తో ఐపీఎస్ సాధించా. శిక్షణ పూర్తయ్యాక గ్రేహౌండ్స్‌లో నాలుగు నెలల పాటు విధులు నిర్వహించి మొదటి పోస్టింగ్‌లో భువనగిరి ఏసీపీగా ఇటీవల విధుల్లో చేరాను.

అమ్మా, నాన్న ప్రోత్సాహంతోనే

అమ్మానాన్న అందించిన ప్రోత్సాహంతోనే రెండో ప్రయత్నంలో ఐపీఎస్ సాధించాను. బీటెక్ పూర్తయిన వెంటనే కరోనా ప్రారంభమైంది. అయినప్పటికీ సివిల్ సర్వీసెస్ సాధించే లక్ష్యంతో మిత్రులతో కలిసి బెంగళూరులో శిక్షణ పొందాను. మొదటి ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకు వెళ్లడంతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ద్వితీయ ప్రయత్నంలో మరింత పట్టుదలగా చదివి లక్ష్యాన్ని సాధించి 2021వ బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యాను. ఇష్టంతో చదివి లక్ష్యాన్ని సాధించాను.

పోలీస్ వ్యవస్థపై మరింత విశ్వాసం

ఐపీఎస్ అధికారిగా ప్రజల్లో పోలీస్ వ్యవస్థపై మరింత విశ్వాసం కల్పిస్తాను. నా సర్వీస్ పూర్తయ్యే వరకు కూడా పోలీస్‌స్టేషన్లను ఆశ్రయించే బాధితులకు న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తా. అలాగే పోలీస్ సిబ్బందితో స్నేహంగా ఉంటూ విధుల్లో చిత్తశుద్ధి చూపేలా ప్రోత్సహించేందుకు ప్రయత్నిస్తాను. ఒత్తిళ్లకు లొంగకుండా బాధితుల పక్షాన ఉంటాను.

ప్రత్యేక లక్ష్యాలతో పని చేస్తాం

నేడు పలు సమస్యలు సమాజానికి సవాల్‌గా మారుతున్నాయి. అత్యాశ, అమాయకత్వంతో పలువురు సైబర్ నేరాలకు గురవుతున్నారు. దీంతో ఆర్థికంగా, సామాజిక గౌరవాన్ని కోల్పోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈమేరకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ నేరాల నియంత్రణకు ప్రయత్నిస్తాం. యువత జీవితాలను మసకబారిస్తున్న మాదక ద్రవ్యాల వినియోగం, సరఫరా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతాం. ఇప్పటికే తనిఖీలు కూడా ప్రారంభించాం. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తాము. రౌడీ షీటర్లకు ఎలాంటి పలుకుబడి ఉన్నప్పటికీ వారిని ఉపేక్షించం. వారి ఆగడాలను ఖచ్చితంగా అడ్డుకుంటాం. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినమైన కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాం. అలాగే పోక్సోతోపాటు అన్ని నేరాల నిందితుల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం. అన్ని తరహాల నేరాల, అక్రమ రవాణాల నియంత్రణకు సిబ్బందితో కలిసి పని చేస్తాం.

ప్రజలకు అందుబాటులో ఉంటా

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటాను. నా పరిధిలోని ప్రజలెవరైనా నేరుగా నన్ను కలువొచ్చు. విజువల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యమిస్తాను. పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణలో ఎదుర్కొనే ఇబ్బందులను నాతో నేరుగా చెప్పుకునే అవకాశం కల్పిస్తా. విధి నిర్వహణలో ఒత్తిడికి లొంగను. నేరుగా నావద్దకు రాలేని భువనగిరి టౌన్, రూరల్, బీబీనగర్, బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రజలు సెల్:8712 662031 ద్వారా సంప్రదించవచ్చు.

సివిల్ సర్వీసెస్‌పై యువతకు అవగాహన కల్పిస్తా

ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ తదితర సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలు సాధించాలని పలువురు యువత, విద్యార్థులు కలలు కంటుంటారు. స్పష్టమైన అవగాహనతో చదవడం, లక్ష్యాన్ని సాధించే వరకు నిరాశ పడకుండా పట్టుదలగా ప్రయత్నిస్తే విజయం సాధించవచ్చు. అలాగే మరో ఉద్యోగ ఆప్షన్ కూడా పదిలంగా ఉంచుకుంటే మంచిది. సివిల్ సర్వీసెస్ ఉద్యోగాల కోసం యూపీపీఎస్సీ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు నావంతు సహకారం అందిస్తా. ఆసక్తిగల యువత, విద్యార్థులు నేరుగా నన్ను సంప్రదించవచ్చు.

విలువైన వస్తువులను లాకర్లలో భద్రపరుచుకోవాలి : సీఐ

భువనగిరి రూరల్, జనవరి7(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవుల్లో ఊర్లకు వెళ్లే వారు విలువైన వస్తువులను లాకర్లలో భద్రపరుచుకోవాలని భువనగిరి రూరల్ సీఐ ఎన్ చంద్రబాబు సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఊరికి వెళ్లే వారు తమ ఇంటి ప్రక్కన ఉన్న వారికి, సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. ఇటీవల దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో పలు సూచనలు చేశారు. ఇంటి చుట్టు లైట్లు వేసి ఉంచాలని, ఇంటి ఆవరణలో సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని , రద్దీగా ఉండే ప్రదేశాలలో బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో ఉన్నప్పటికి లగేజి బ్యాగులతో పాటు సెల్‌ఫోన్లు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో ఎస్‌హెచ్‌వో వారణాసి సంతోష్‌కుమార్ ఉన్నారు.

విష్ణుపురంలో నిలిచిన ప్రత్యేక రైలు

దామరచర్ల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే ప్రత్యేక రైలు నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం విష్ణుపురం రైల్వే స్టేషన్‌లో సుమారు గంటన్నరపాటు నిలిచిపోయింది. రాత్రి 11.30 గంటల సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లాలోని నడికుడి-పొందుగుల మధ్య గూడ్స్ రైలు ఒక బోగి పట్టాలు తప్పింది. ఈ నేపథ్యంలో అధికారులు విష్ణుపురం రైల్వే స్టేషన్‌లో తిరుపతి ప్రత్యేక రైలును నిలిపివేశారు. అనంతరం రైల్వే సిబ్బంది పట్టాలు, గూడ్స్‌కు మరమ్మతు చేయడంతో ప్రత్యేక రైలు స్టేషన్ నుంచి బయలుదేరింది సుమారు గంటన్నరపాటు అంతరాయం కలుగడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు.

యాదాద్రి ఆలయ శిల్పకళా నైపుణ్యం అత్యద్భుతం

చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకుడు సీఎస్.రంగరాజన్



రంగరాజన్‌కు ప్రసాదం అందిస్తున్న అర్చకులు



ఆంజనేయస్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : పంచనారసింహుల ఆలయం శిల్పకళా నైపుణ్యంతో అత్యద్భుతంగా నిర్మించారని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకుడు సీఎస్.రంగరాజన్ అన్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామిని మంగళవారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు స్వామివారిని దర్శించుకోవడం ఎన్నో జన్మల పుణ్యఫలమన్నారు. ధనుర్మాసంలో క్షేత్రాన్ని సందర్శించడం ఆనందకరమన్నారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూ రం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్రాగమశాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంల పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామికి ముఖ మండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 31,61,682 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, ఆలయంలో ధనుర్మాసోత్సవాలు 23వ రోజుకు చేరాయి. గోదాదేవి అమ్మవారి అభిష్టాన్ని గోపికలకు వివరించిన పాశురం పండితులు పఠించారు. ఉత్తర తిరువీధిలో ఏకాదశి వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి.

వైభవంగా ముగిసిన క్రీస్తు సాక్షాత్కార ఉత్సవాలు



చర్చిలో మరియుమాత విగ్రహం ఎదుట కొవ్వొత్తులు వెలిగిస్తున్న భక్తులు

కేతేపల్లి, జనవరి 7(ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న క్రీస్తు సాక్షాత్కార ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన కొవ్వొత్తుల మొక్కులు, మేరీమాత ప్రదర్శనను మంగళవారం సాయంత్రం భక్తిశ్రద్ధ లతో నిర్వహించారు. ఈ సందర్భంగా కేతేపల్లితో పాటు పరిసర చీకటిగూడెం, కొర్లపహాడ్, కొత్తపేట గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆటోలు, ట్రాక్టర్లలో కులమతాలకు అతీతంగా తరలి వచ్చి మరియమాత విగ్రహం ఎదుట కొవ్వొ త్తులు వెలిగించి మొక్కులు చెల్లించారు. వెలిగించిన కొవ్వొత్తులను పట్టుకుని కేతేపల్లి లోని ప్రధాన వీధుల్లో పాటలు పాడుతూ డప్పు చప్పుళ్ల మధ్య ప్రదర్శ నగా చర్చి వద్దకు వచ్చారు. ఏసుక్రీస్తు, మరియమాతకు కొవ్వొత్తులు సమర్పించి పాదర్ల ఆశీర్వాదం పొందారు. చర్చి పాదర్ మాదాను ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో చర్చి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వరల్డ్ పవర్ లిఫ్టింగ్‌లో అమృత్‌సింగ్‌కు జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి



అమృత్‌సింగ్‌ను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ స్పోర్ట్స్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని నోయిడాలో ఇటీవల నిర్వహించిన వరల్డ్ పవర్ లిఫ్టింగ్‌లో ఓపెన్ కేటగిరి 245 కిలోల విభాగం పోటీల్లో నల్లగొండ స్టేట్ బ్యాంకు ఇండియా ఏఎంసీ బ్యాంకు మేనేజర్ సాగర్ అమృత్‌సింగ్ మెడల్ సాధించారు.మంగళవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని అమృత్‌సితతంగ్ కలిశారు. జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన అమృతసింగ్‌ను అభినందించారు.

ఫొటోగ్రాఫర్ సంజీవకు జాతీయ అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న సంజీవ

రామన్నపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): యా దాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లం కి గ్రామానికి చెందిన ఫొటో గ్రాఫర్ కాట్రేగు సంజీవకు జాతీయ అవార్డు లభించింది. ఒడిషా రాష్ట్రంలో ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించిన 7వ హుస్సేన్‌ఖాన్ జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లో అదే రాష్ట్ర గిరిజన జాతికి చెందిన బొండా తెగ సంప్రదాయ వేష, దారణ, నృత్యాలు, జీవన శైలి విధానాలను తెలిపే ఫొటోప్రదర్శనకు జాతీయ అవార్డు లభించింది. సంజీవకు అవార్డును నిర్వాహకులు హుస్సేన్‌ఖాన్, ఎఫ్ఆర్ బీఎస్, ఎఫ్ఐసీ ప్రతినిధులు అందజేశారు.

నేడు భూదాన్‌పోచంపల్లికి అధికారుల బృందం

భూదాన్‌పోచంపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో జరుగుతున్న ఎన్‌సీడీ కార్యక్రమాన్ని పరిశీలించేందుకు న్యూఢిల్లీ నుంచి నేషనల్ హెల్త్ మిషన్ ఐఏఎస్ అధికారుల బృందం రానుందని భూదాన్‌పోచంపల్లి మండల వైద్యాధికారి శ్రీవాణి తెలిపారు. మండల ంలోని భూదాన్‌పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ముక్తాపూర్‌లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో జరుగుతున్న ఎన్‌సీడీ - నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం అమలు తీరును పరిశీలించేందుకు అధికారుల బృందం వస్తోందని ఆమె తెలిపారు.

ఉన్నత ప్రమాణాలతో బోధన అందించాలి



నార్కట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకులతో సమీక్షిస్తున్న బీఐఈ జాయింట్ సెక్రటరీ భీంసింగ్

నార్కట్‌పల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన బోధన అందించి ఉత్తమ ఫలితాలను సాధించాలని కాలేజీ అధ్యాపకులకు ఇంటర్మీడియట్ బోర్డు జాయింట్ సెక్రటరీ భీంసింగ్ సూచించారు. మంగళవారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మం డల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీని సందర్శించి కాలేజి ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమీక్ష నిర్వహించారు. కాలేజీ ఆవరణ, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, మొదటి విద్యా సంవత్సరంలో సాధించిన పరీక్షా ఫలితాలు, బోధనలో ఉన్న గ్రూపులు, రికార్డుల నిర్వహణను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. వార్షిక పరీక్షలకు ఇంకా 90 రోజులే సమయం ఉన్నందున విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయడానికి రూపొందించిన ప్రణాళికను తెలుసుకుని తగు సూచనలు చేశారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారెదుర్కుంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాగా కాలేజీ గతేడాది విద్యాసంవత్సరంలో ప్రారంభమై రెండో విద్యా సంవత్సరానికి చేరుకుందని అయినప్పటికినీ నేటికి కాలేజీకి ఫర్నీచర్ ఇవ్వలేదని, సొంత భవనం మంజూరు చేయలేదని, అద్దె భవనంలో నిర్వహిస్తున్నా నేటికీ అద్దె కూడా నిర్ధారించలేదు, చెల్లించలేదని కాలేజీ ప్రిన్సిపాల్ మహ్మద్ ఇస్మాయిల్ బీఓఐ జాయింట్ సెక్రటరీ భీంసింగ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలను ఇంటర్మీడియట్ బోర్డు డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాగా భీంసింగ్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి దస్రూనాయక్ ఉన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు రిమాండ్

కోదాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో చోరీలు చేస్తున్న నలుగురు దొంగలను సూర్యాపేట జిల్లా మునగాల పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. నిందితుల నంచి రూ14లక్షల విలువైన 19 తులాల బంగారు ఆభరణాలు, చేతి గడియారం, రెండు పంచలోహ విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు. కోదాడలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. మునగాల మండలం మొద్దులచెరువు గ్రామ స్టేజి సమీపంలో జాతీయ రహదారి 65పై వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. ఈ క్రమంలో సూర్యాపేట నుంచి కోదాడ వైపు వెళుతున్న లారీ తనిఖీ చేయగా లారీలో డ్రైవర్ పక్కన నలుగురు వ్యక్తులు కూర్చొని ప్రయాణిస్తున్నారు. అనుమానంగా ఉన్న వారిని అదుపులోకి తీసుకుని బ్యాగ్ తనిఖీ చేసి బంగారు అభరణాలు, రెండు పురాతన విగ్రహలు, వాచ్‌ని స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన దర్యాప్తులో ఏపీ, తెలంగాణలో పలు ప్రాంతాల్లో చోరీలు చేసినట్లు నిందితులు షేక్ బాబావలి(ఏపీలోని గుంటూరు జిల్లా కారంపూడి), వడ్డే పవన్‌కుమార్ (తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలోని మహబూబ్‌నగర్ పట్టణం), సరికొండ మహేష్ (మహబూబ్‌నగర్‌లోని రుద్రారం), పూర లింగయ్య(నల్లగొండ జిల్లాలోని కేతేపల్లి గ్రామం). అంగీకరించారు. ఈ నలుగురినీ అరెస్టు చేసి, కేసు నమోదు చేసి, కోర్టుకు రిమాండ్ చేసినట్లు తెలిపారు. నిందితులపై గతంలో పలు కేసులు ఉన్నా యని, జైలుకు కూడా వెళ్లి వచ్చినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో మునగాల సీఐ ఎం శివకుమార్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, కానిస్టేబుళ్లు వెంకన్న, శ్రీనివాసు, గురుస్వామి, మల్లేశ్, ఆనంద్, సతీష్‌లు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా మణికంఠ



భువనగిరి టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా, ఆ సంఘం అనుబంధ విభాగం స్టూడెంట్స్ ఫర్ డెవలప్‌మెంట్ (ఎస్ఎఫ్‌డీ) రాష్ట్ర కన్వీనర్‌గా భువనగిరి పట్టణానికి చెందిన సుర్వి మణికంఠను నియ మించారు. ఈ మేరకు ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నక్క జానారెడ్డి నియామక ఉత్తర్వులను మంగళవారం జారీ చేశారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా ఉన్న ఆయన రెండోసారి కూడా కొనసాగుతుండగా, నూతనంగా ఎస్ఎఫ్‌డీ రాష్ట్ర కన్వీనర్‌గా నియమించారు.

అతని పేరు చెబితే.. హడల్ !

(5వపేజీ తరువాయి)

ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు గైడ్‌లైన్స్ ప్రకారం ఇస్తూనే ఉంటామని దీనిపై తమని బెదిరించి మధ్యవర్తుల ద్వారా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని సదరు ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు.

● బెదిరింపుల్లో మచ్చుకు కొన్ని..

వ్యవసాయశాఖ కమిషనరేట్‌లో పనిచేసే ఒక సెక్షన్ ఉద్యోగి, జిల్లాల్లోని వ్యవసాయశాఖ అధికారులు, ఉద్యోగులతో పని నిమిత్తం వాట్సప్‌లో సమాచార మార్పిడి, ఇతర సంభాషణ చేయగా, ఆ వాట్సప్ చాటింగ్‌లలో ఒక ఉద్యోగితో చేసిన చాటింగ్‌కి సంబంధించిన స్క్రీన్‌షాట్లను సంపాదించిన ఈ వ్యక్తి సదరు కమిషనరేట్ ఉద్యోగిని బెదిరించి, డబ్బు వసూలు చేయడమే కాకుండా ఇప్పుడు తనకు ఏ అవసరమున్నా కమిషనరేట్‌లో ఈ ఉద్యోగిని అడ్డంపెట్టుకొని పనులు చేయించుకుంటున్నాడు. ఇతని చేతిలో సదరు ఉద్యోగి కీలుబొమ్మలా మారిపోయారని ఉద్యోగుల్లో చర్చ సాగుతుంటే, సదరు ఉద్యోగి సైతం ఏం చేయలేని పరిస్థితి ఎదుర్కొంటున్నానని వాపోతున్నారు.

వణుకుతున్న ఏఈవోలు, ఏవోలు

ఏవోలు, ఏఈవోలని సైతం వదలని ఈ వ్యక్తి తన బృందం ద్వారా ఏఈవోలు పనిచేయడం లేదని, ఫీల్డ్‌లో ఉండడం లేదని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారని చెబుతున్నారు. ఫీల్డ్‌లో ఉంటే ఫొటోలు తనకు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారని, అధికారుల నోటీస్‌లో ఉన్న తర్వాతే తాము ధాన్యం కొనుగోళ్లకైనా, మీటింగులకైనా, ఇతర పనులేవైనా నిర్వహిస్తామని తమ వ్యక్తిగత విషయాలను అడిగి బెదిరింపులకు పాల్పడుతూ, రూ.40 వేలు, రూ.50వేలు అడుగుతూ సతాయిస్తున్నారని వాపోతున్నారు. వీరి ఒత్తిళ్లు, దరఖాస్తులతో ఉన్నతాధికారుల హెచ్చరికలకు భయపడి కొందరు ఏఈవోలు మధ్యవర్తుల ద్వారా డబ్బులిచ్చినట్లు పేర్కొన్నారు. తమ వ్యక్తిగత విషయాలు సర్వీస్ విషయాలను సైతం అడ్డంపెట్టుకొని బెదిరింపులకు పాల్పడుతున్నారని, హెచ్ఆర్, వెహికిల్ అలవెన్స్, వాహనాల కిరాయిల వంటి వివరాలు అడుగడమే కాకుండా తమ లోన్లు, ఇతర వ్యవహారాల గురించి కూడా దరఖాస్తుల్లో అడుగుతున్నారని వాపోతున్నారు. ఈవ్యక్తి తాజాగా ఒక ఏవోపై 40కిపైగా ప్రశ్నలతో దరఖాస్తు చేశారని, రైతుబంధు క్లెయిమ్ విషయంలో డబుల్ డాక్యుమెంట్ చేయించి సక్రమంగా లేకున్నా ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారని వాపోతున్నారు. మరోవైపున మధ్యవర్తి ద్వారా సెటిల్‌మెంట్‌కు రాయబారం పంపారని, దీంతో తాము ఇబ్బందిపడుతున్నామని సదరు ఏవో, ఏఈవోలు వాపోతున్నారు. ఇంకో ఏవో సైతం ఇతని ఒత్తిళ్లకు తట్టుకోలేక ముడుపులిచ్చేశారని, తనకు సంబంధం లేకపోయినా, ఎలాంటి అక్రమానికి పాల్పడకపోయినా తన కుటుంబాన్ని కార్నర్ చేయడంతో వాళ్లని ఇబ్బంది పెట్టలేక ఇతనికి ముడుపులిచ్చి వదిలించుకున్నారని చెబుతున్నారు. మొత్తంగా వ్యవసాయశాఖను నీడలా వెంటాడుతున్న ఈ వ్యక్తిని కట్టడి చేయాలని, తమకు ఇతని బెదిరింపుల నుంచి ఉపశమనం కల్పిం చాలని ఉద్యోగులు, అధికారులు వేడుకుంటున్నారు. చట్టపరంగా తాము తప్పు చేస్తే, అవకతవకలకు పాల్పడితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోవచ్చని, అంతేతప్ప ఇలా వసూళ్లకు పాల్పడితే ఎలా అని ఉద్యోగులు మదనపడుతున్నారు.

సూర్యాపేట

హుజూర్‌నగర్ - కోదాడ

నిలిచిన 'రేషన్' రవాణా

(5వపేజీ తరువాయి)

హమాలీ కార్మిక సంఘాల నాయకుల మధ్య చర్చలు జరిగాయి. క్వింటాకు ఎగుమతి, దిగుమతి చేసినందుకు రూ.29 ఇచ్చేలా ఒప్పందం జరిగింది. దీంతో పాటు మరికొన్ని డిమాండ్లు కూడా అధికారులు అంగీకరించారు. అయితే పెంచిన ధరలు జనవరి నుంచి అమలు చేయాల్సి ఉంది. దానికి సంబంధించిన జీవోను అధికారులు విడుదల చేయలేదు. దీంతో హమాలీలు సమ్మెకు దిగారు.

జిల్లాలో నాలుగు ఎంఎల్‌ఎస్ పాయింట్లు

జిల్లా పరిధిలో నాలుగు ఎంఎల్‌ఎస్ పాయింట్లు ఉన్నాయి. సూర్యాపేట, కోదాడ, తుంగతుర్తి, హుజూర్‌నగర్‌లో ఉన్నాయి. ఇక్కడి నుంచి ప్రభుత్వం బియ్యం దిగుమతి అవుతోంది. అక్కడి నుంచి ఆయా ప్రాంతాల్లోని రేషన్ దుకాణాలు, విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాలకు ప్రతి నెలా సరఫరా చేస్తారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి ఇది వరకే కాంట్రాక్టు దక్కించుకున్న స్టేజ్-2 కాంట్రాక్టర్ వాహనాల్లో బియ్యాన్ని సరఫరా చేస్తారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ల వద్ద బియ్యాన్ని వాహనాల్లోకి లోడ్ చేయడం, తిరిగి రేషన్ దుకాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యాసంస్థలు, వసతిగృహాల వద్ద అన్‌లోడ్ చేయడం హమాలీల బాధ్యత. అందుకు ప్రభుత్వం కూలీ చెల్లిస్తోంది. జిల్లాలో సుమారు 250 మంది హమాలీలు, స్వీపర్లు పనిచేస్తున్నారు.



సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతి పత్రం అందచేస్తున్న హమాలీలు, సీఐటీయూ నాయకులు

కూలీ రేట్ల జీవోను విడుదల చేయాలి



సివిల్ సప్లయ్ విభాగంలో పనిచేస్తున్న హమాలీల కూలీ రేట్ల జీవోను ప్రభుత్వం విడుదల చేయాలి. గత ఏడాది అక్టోబరులో చేసుకున్న ఒప్పందాన్ని వెంటనే అమలుచేయాలి. హమాలీలకు ఆరోగ్య భద్రత కల్పించాలి. ప్రభుత్వం నూతనంగా గిడ్డంగులను నిర్మించాలి. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి. ప్రభుత్వం వెంటనే కార్మిక సంఘాలతో చర్చలు జరిపి హమాలీల డిమాండ్లను నెరవేర్చాలి.

● మేకల శ్రీనివాసరావు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి

బియ్యం రవాణాకు ఇబ్బందులు లేకుండా చేశాం

జిల్లాలో సివిల్ సప్లయ్ హమాలీలు సమ్మె చేస్తున్నారు. దీంతో జిల్లాలో బియ్యం రవాణాకు ఇబ్బందులు లేకుండా చేశాం. ప్రస్తుతం ప్రైవేట్ వ్యక్తులతో తాత్కాలికంగా బియ్యం సరఫరా చేయిస్తున్నాం. ప్రజలకు, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటుచేశాం. కార్మిక సంఘాలతో ప్రభుత్వం మాట్లాడి త్వరలోనే సమ్మెను విరమింపచేసే అవకాశముంది.

● రాజేశ్వర్, డీఎస్‌వో సూర్యాపేట.

ప్రమాదకరంగా మూల మలుపు



లింగగిరి రోడ్డు మూలమలుపులో ప్రమాదకరంగా గుంత

హుజూర్‌నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని టీచర్స్ కాలనీ, లిం గగిరి రోడ్డులోని పీర్లచావిడి రోడ్డు మూ ల మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఈ మూలమలుపుల్లో డ్రైనేజీ గూనలు ధ్వంసమై గుంతలు ఏర్పడడం తో ప్రమాదకరంగా ఉన్నారు. పట్టణంలోని 18వ వార్డులోని పీర్లకొట్టం బజా రు నుంచి లింగగిరి రోడ్డుకు వెళ్లే మూ లమలుపులో డ్రైనేజీ పైపు ధ్వంసమైనందున రాకపోక లు సాగించడానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీ కాలువ పక్కన పెద్ద గుంత ఏర్పడి ప్రమాదా లు జరుగుతున్నా ఎవరూ మరమ్మతు చేయించడంలే దు. గతంలో ఆ ప్రాంతంతో సీసీ రోడ్డు నిర్మించచారు. అయితే పాత సీసీ రోడ్డు వ్యర్థాలను అక్కడే ఉంచినందున రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అదేవిధంగా పట్టణంలోని టీచర్స్ కాలనీ మూల మలుపు నుంచి ఎంపీపీ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారి మూలమలుపులో గూనలు ధ్వంసమయ్యాయి. టీచర్స్ కాలనీలో ఇటీవల రోడ్డును విస్తరించినా పాత గూనలను మార్చలేదు. దీంతో అవి ధ్వంసమై ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇక్కడికి సమీపంలోనే ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఉన్నందున ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు ఆందోళనతో ఉన్నారు.

మూలమలుపులో మరమ్మతులు చేయాలి



పట్టణంలోని పీర్లచావిడి సెంటరులోని మూలమలుపులో డ్రైనేజీ పైపు ధ్వంసమై పెద్ద గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఈ కల్వర్టును మరమ్మతు చేయించాలని ఎడాది కాలం నుంచి అధికారులకు, ప్రజా ప్రతినిధులకు చెబుతున్నా ఎవరూ స్పందించడం లేదు. తక్షణమే స్పందించి మరమ్మతులు చేయించాలి.

- షేక్‌జానీపాషా,కాలనీవాసి

త్వరలో మరమ్మతు చేయిస్తాం

టీచర్స్‌కాలనీ, లింగగిరిరోడ్డు మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయని ప్రజలు నాదృష్టికి తీసుకువచారు.త్వరలో మరమ్మతులు చేయించి ఇబ్బందులను తొలగిస్తాం.

-శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్, హుజూగర్‌నగర్

మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అమలుచేయాలి

హుజూర్‌నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అమలుచేయాలని ఎంఈవో సైదానాయక్ కోరారు. మంగళవారం మండలంలోని వేపలసింగారం, మిట్టగూడెం ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న మెనూను సక్రమంగా అందించాలన్నారు. ప్రాథమిక విద్య బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయ్‌కుమార్, పద్మకుమారి పాల్గొన్నారు.

'కాలుష్యం నుంచి కాపాడాలి'

కోదాడ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) రైస్ మిల్లుల నుంచి వెలువడే కాలుష్యం నుంచి కాపాడాలని మునిసిపాలిటీ పరిధిలోని తమ్మర, లక్ష్మీపురం కాలనీల ప్రజలు కలెక్టర్, నల్గొండ పొల్యూషన్ బోర్డు అధికారులను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు సిరిపురపు హేమ, సట్టు వీరస్వామి, వెలిదె పద్మ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష డప్పుల రథయాత్ర ప్రారంభం

నేరేడుచర్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేటలో నిర్వహించే వేయి గొంతుకలు, లక్ష డప్పుల రథయాత్రను మంగళవారం నేరేడుచర్లలో ఎమ్మార్పీయస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇంజమూరి మల్లయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణ ఎమ్మార్పీఎస్ అంతిమ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్లమూడి ఉపేందర్, యడవెల్లి చంద్రయ్య, పల్లెపంగు నాగరాజు, దోరేపల్లి వెంకటేశ్వర్లు, మంద కాంతయ్య, నందిపాటి హిందూజ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీవేణుగోపాలస్వామి శోభాయాత్ర

హుజూర్‌నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవేణుగోపాల-శ్రీసీతారామచంద్రస్వామి శోభాయాత్రను బుధవారం అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఈవో గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. మంగళవారం దేవాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ శోభాయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సాముల రామిరెడ్డి, విజయలక్ష్మి, పద్మ, మాధవరావు, భారతమ్మ, సుజాత, పిచ్చమ్మ, విజయలక్ష్మి పద్మ పాల్గొన్నారు.

హమాలీ నాయకుల అరెస్టు సరికాదు

చివ్వెంల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): శాంతియుతంగా సమ్మె చేస్తున్న సివిల్ సప్లై హమాలీ నాయకులను అరెస్టు చేయడం సరికాదని హమాలీ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో హమాలీ కార్మికులు, సీఐటీయూ నాయకులు సమ్మె చేస్తుండగా పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగ వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వేల్పుల వెంకన్న, అమ్మయ్య, ఏసు, నవీన్, రాంబాబు, నాగరాజు, వరుణ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తుంగతుర్తి(ఆంధ్రజ్యోతి): హమాలీలను అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్య అని హమాలీ యూనియన్ కార్మికుల జిల్లా ప్రధాన కార్యదర్శి బొంకూరి శ్యాంసుందర్ అన్నారు. మంగళవారం గోదాం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీ కార్మికులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలి

పాలకవీడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం చైర్మన్ రాపోలు నవీన్, బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు, చింతికింది కుమారస్వామి, వరంగల్ జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి వనాస ప్రసాద్‌లు కోరారు. మలిదశ ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జేఏసీ ఆధ్వర్యంలో పాలక వీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా నుంచి సూర్యాపేటకు చేపట్టిన పాదయాత్రలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ం చిలకరాజు శ్రీను, లక్ష్మి, కొమ్రరాజు వెంకట్, పోకల వెంకటేశ్వర్లు, కడియాల అప్పయ్య, ఇంజమూరి రాజేష్, పెరుమాళ్ల సతీష్, రాంసైదులు, రఫి, సీతారాములు, ఇంతియాజ్, అంజి, వీరస్వామి, చిలక బాబు, మురళి, రామయ్య, నరహరి, సైదులు పాల్గొన్నారు.

అతివేగంతోనే అధిక ప్రమాదాలు



సూర్యాపేటలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్టీవో సురేష్‌రెడ్డి, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు సతీష్‌కుమార్, విక్రమ్‌కుమార్

సూర్యాపేట అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): డ్రైవర్ల అతివేగంతోనే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని జిల్లా రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారి సురేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్‌స్టేషన్, , హైటెక్ బస్‌స్టేషన్ ఎదుట క్యాబ్ డ్రైవర్లకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గత సంవత్సరం రాష్ట్రంలో 1.70లక్ష మంది ప్రాణాలు కోల్పోగా 6లక్షల మంది దివ్యాంగులుగా మారారని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌లు సతీష్‌కుమార్, విక్రమ్‌కుమార్, పెరుమాళ్ళ ప్రవీణ్, జంగం మహేష్, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

● సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్‌ఐ సాయిరాం ట్రాఫిక్ నియమ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు.

● కోదాడ రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లబండగూడెంలో అంతర్రాష్ట చెక్‌పోస్టు వద్ద వాహనదారులకు జిల్లా రవాణా శాఖ అధికారి సురేష్‌రెడ్డి పూలు అందిస్తూ సీటు బెల్ట్ ధరించాలని, హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ రాజ్‌మహ్మద్, శ్రీనివాస్, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ సాయిప్రసాద్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్, అర్వపల్లి (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని హుజూర్‌నగర్, అర్వపల్లి ఎస్‌ఐలు ముత్తయ్య. బాలకృష్ణ కోరారు. మంగళవారం ఆయా మండల కేంద్రాల్లో వాహనదారులతో సమావేశం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసు,ఉపేందర్, కాశయ్య, ఏఎస్‌ఐ రాములు, రాంకోటి, రవి, అశోక్,మహరాజు పాల్గొన్నారు.

ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ల వేతనాలు పెంచాలి

సూర్యాపేట రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్ ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్లు, హెల్పర్ల వేతనాలు పెంచాలని ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ బాబా, ప్రధాన కార్యదర్శి నిమ్మల ప్రభాకర్ అన్నారు. వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మండలంలోని ఇమాంపేట హెచ్‌పీసీఎల్ ఎదుట చేస్తున్న సమ్మె రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లకు రూ.1000, హెల్పర్లకు రూ.700లు ఇవ్వాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పిడమర్తి నాగరాజు, వెంకటనారాయణ, సాయిబాబా, రాములు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



వార్డు అధికారుల శిక్షణలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, కమిషనర్ బి.శ్రీనివాస్

సూర్యాపేట టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీకి నూతనంగా వచ్చిన వార్డు అధికారులు పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో వార్డు అధికారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు, ప్రభుత్వ పథకాలకు మధ్య వారధులుగా అధికారులు ఉండాలన్నారు. వార్డుల్లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్, ఈఈ ఎం. కిరణ్, డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఆర్వో కల్యాణి, ఏఈ తిరుమలయ్య, గౌసుద్దీన్, ఎస్ఎస్ఆర్. ప్రసాద్, ప్రభుకుమార్, మనోజ్, సురేష్, సతీష్, వసుంధర పాల్గొన్నారు.

పేదలను ఆదుకుంటాం: ఎమ్మెల్యే సామేలు



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేలు

అర్వపల్లి, తిరుమలగిరి జనవరి 7(ఆంధ్రజ్యోతి): పేదలను ఆదుకుంటామని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మంగళవారం తిరుమలగిరి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అర్వపల్లి మండలానికి చెందిన ఏడుగురికి, తిరుమలగిరి మండలానికి చెందిన 15మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపెల్లి మధుకర్‌రెడ్డి, దాసరి సోమయ్య, నర్సింగ వెంకటేశ్వర్లు, బద్దం యాదగిరి, కాంగ్రెస్ పార్టీ తిరుమలగిరి మండల అధ్యక్షుడు వై.నరేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మీలాల్, పట్టణ అధ్యక్షుడు పేరాల వీరేష్, సుంకరి జనార్దన్, శాగంటి రాములు, సుధాకర్, అబ్బాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు

● నేరేడుచర్ల (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని రామాపురం కాలనీకి చెందిన వేముల బాలుకు మంజూరైన రూ.34,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును మునిపిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నూకల సందీప్‌రెడ్డి, పాల్వాయి కృష్ణమూర్తి, నాగయ్య, ఇంజమూరి పున్నయ్య, మెండె జాను, కృష్ణ శ్రీనివాసు, సురేష్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి



తుంగతుర్తి మండలంలోని రామన్నగూడెంతండాలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న సీతయ్య, రాములుగౌడ్ తదితరులు

తుంగతుర్తి, ఆత్మకూర్(ఎస్) చిలుకూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా రూ. 15వేలు ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ తుంగతుర్తి మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు అవలంభిస్తోందని ఆరోపిస్తూ, మంగళవారం మండలంలోని రామన్నగూడెం తండాలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుండగాని రాములు గౌడ్, గాదరి యాదగిరి, ఆంగోతు నరేష్, కాంతమ్మ, బాలు, రవి తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మకూర్(ఎస్)లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూడి నర్సింహారావు, మర్ల చంద్రారెడ్డి, ముద్దం కృష్ణారెడ్డి, బత్తుల ప్రసాద్, సానబోయిన సుధాకర్ తదితరులు పాల్గొని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ ప్రదీప్‌రెడ్డికి అందజేశారు.

పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలి

రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ చిలుకూరు మండల అధ్యక్షుడు జానకిరామాచారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.. రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ నాయకులు ప్రకటించి, ప్రస్తుతం రూ.12వేలు ఇస్తామని ప్రకటించడం హాస్యాస్పద మన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల కార్యదర్శి అంబాల రాంబాబు, పీఏసీఎస్ చైర్మన్ అల్సకాని జనార్దన్, నాయకులు షేక్ జానీ మియా, దొడ్డా సురేష్, తాళ్లూరి శ్రీనివాస్, కస్తూరి నర్సయ్య, బట్టు శివాజీ, కొండా అన్నపూర్ణ, షేక్ పాషా, మంకెన శ్రీను, కొడారు రాంబాబు, ఉపేందర్, కొండా ఉదయ్, కుర్రా అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఎమ్మెల్సీగా గెలిపించాలి



కోదాడలో మాట్లాడుతున్న అలుగుబెల్లి నర్సిరెడ్డి

కోదాడ టౌన్, మునగాల రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మరోసారి ఎమ్మెల్సీగా తనను గెలిపించాలని ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. మంగళవారం కోదాడ లోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో, మునగాల మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పౌర స్పందన వేదిక జిల్లా అధ్యక్షుడు ఆర్.ధనమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కే.మంగ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, కె.జ్యోతి, పాండురంగాచారి, ధనమూర్తి, ఎంఈవో పిడతల వెంకటేశ్వర్లు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బూర సైదయ్యగౌడ్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

సూర్యాపేట(కలెక్టరేట్), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకుడు సాయిబాబా, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వెంకటరమణ, లక్ష్మినారాయణ, శ్రీనివాస్, తేజశ్రీ, స్నేహలత, సయ్యద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై నిర్లక్ష్యం తగదు

హుజూర్‌నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలపై నిర్లక్ష్యం తగదని జిల్లా సంక్షేమ శాఖ అధికారి నర్సింహారావు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని గోదాం బజార్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలలు, మహిళలకు సక్రమంగా అందించాలని, లేనట్లయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీడీపీవో వెంకటలక్ష్మి, సరళకుమారి,అధికారులు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణ బాగుండాలి

పెన్‌పహాడ్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నర్సరీల నిర్వహణ బాగుండాలని జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పెన్‌పహాడ్, సింగారెడ్డిపాలెం, అనంతారం గ్రామ పంచాయతీలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నర్సరీలపై నిర్వాహకులు అశ్రద్ధ చూపొద్దని అన్నారు. గ్రామ పంచాయతీల్లో రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు. ప్రతిరోజు పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యండా ఉండే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతి అధికారి సంజీవ, కార్యదర్శులు నాగరాజు, సోమయ్య, అఖిల్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూర్(ఎస్): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో అడ్మిషన్ల కోసం ఈ నెల 28వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఆరో తరగతిలో 100మంది, మిగతా తరగతుల్లో ఖాళీగా ఉన్న అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, దరఖాస్తుదారులకు ఏప్రిల్ 13న పరీక్ష నిర్వహిస్తామన్నారు.

వరి నాట్లపై విద్యార్థులకు అవగాహన

ఆత్మకూర్(ఎస్: అగ్రికల్చర్ ఒకేషనల్ కోర్సు క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా మంగళవారం ఆత్మకూర్(ఎస్)లోని మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్ విద్యార్థులు పొలంలోకి దిగి వరి నాట్లు వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఒకేషనల్ ట్రైనర్ డానియల్, ఉపాధ్యాయులు భూతం యాకమల్ల, రమేష్, లక్ష్మి, విజయనిర్మల, హుస్సేన్‌బీ, పాల్గొన్నారు.

దామోదర్‌రెడ్డిని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూర్(ఎస్): కొద్దిరోజులుగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాకి కృపాకర్‌రెడ్డి, గోపగాని సత్యం, కొప్పుల శేఖర్‌రెడ్డి, కర్నాకర్, పచ్చిపాల వెంకన్న, మధు, వెంకట్‌రెడ్డి, పందిరి కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

టీబీ రహిత మండలంగా తీర్చిదిద్దుతాం

పెన్‌పహాడ్: పెన్‌పహాడ్‌ను టీబీ రహిత మండలంగా తీర్చిదిద్దుటకు కృషి చేస్తున్నామని ఎంపీహెచ్ఈవో భూతరాజు శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం పెన్‌పహాడ్ మండలం మాచారం గ్రామంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు నిర్వహించిన ఆరోగ్య శిబిరం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈశిబిరంలో షుగర్, టీబీ లక్షణాలు ఉన్న 24మందిని గుర్తించామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది జానకమ్మ, రాజు, వీరమ్మ, దుర్గాభవాని, కార్యదర్శి వెంకటలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమ సమాజ స్థాపనకు పోరాడాలి

మఠంపల్లి: సమ సమాజ స్థాపనకు విద్యార్థులు పోరాడాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకుడు ఎం.రాజు అన్నారు. మండలంలోని బక్కమంతుల గూడెం సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎస్ఎఫ్ఐ సభ్యులు మంగళవారం సందర్శించి విద్యార్థినులను అడిగి సమస్యలు తెలుసుకుని మాట్లాడారు. ప్రైవేటు విద్యారంగ సంస్థలను పాలక ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. విద్యార్థులందరూ ఎస్ఎఫ్ఐలో చేరి సమస్యలపై పోరాటలు చేస్తూ సంఘం బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పదీప్, అశోక్, అంకిత, సునీత, శోభ, ప్రణీత, వీణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులే

మఠంపల్లి: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్య పాండునాయక్ అన్నారు. సంగారెడ్డి జిల్లాలో ఈ నెల 25నుంచి 28వరకు జరిగే సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం మఠంపల్లిలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలోమాలోతు బాలునాయక్, సయ్యద్ రన్‌మియా, పి.రాము, రాజు, జయరాజు, బాలు, రమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హుజూర్‌నగర్: పట్టణంలోని పలు ప్రాంతాలలో ఎల్‌టీ-5 విద్యుత్ లైన్ వైర్ లాగేందుకు విద్యుత్ సరఫరాను బుధవారం నిలిపివేస్తున్నట్లు ఏఈ రాంప్రసాద్ తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎన్‌జీవో కాలనీ, చంద్రంహోటల్ బజారు, గాంధీ పార్క్, పీర్లకొట్టం, సాయిబాబా మందిరం ఏరియాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. .

డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం

చిలుకూరు: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ శ్రీనివాసాచారి మృతిచెందాడు. శ్రీనివాసాచారి కుటుంబానికి తోటి లారీ డ్రైవర్లు, యజమానులు, గ్రామస్థులు రూ.45వేల ఆర్థికసాయాన్ని మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లా ఉపేందర్, గన్నా అజయ్, గన్నా ప్రవీణ్, సత్యనారాయణ, వీరయ్య, నరేష్, శ్రావణ్, సైదులు, ఆది తదితరులు పాల్గొన్నారు.

జీవిత బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మునగాల రూరల్: పోస్టల్ శాఖ జీవిత బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట జీవిత బీమా అభివృద్ధి అధికారి జింజిరాల సైదులు అన్నారు. మంగళవారం మండలంలోని కొక్కిరేణి గ్రామంలో బీమా పథకాలపై పోస్టల్ సిబ్బంది మహా ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎం దయాకర్, పోస్ట్‌మాస్టర్ నరహరి, పోస్టు మాస్టర్లు, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టుమాస్టర్లు పాల్గొన్నారు.

మేధావుల సంఘీభావ సభకు తరలిరావాలి

కోదాడ టౌన్: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 11న నిర్వహించే మేధావుల సంఘీభావ సభను విజయవంతం చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి కత్తి వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం కోదాడ పట్టణం హుజూర్‌నగర్ రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సంఘీభావ సభ కరపత్రాలను ఉద్యోగ సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపూరి పర్వతాలు, పిడమర్తి సైదులు, చేకూరి రమేష్, బొల్లి కొండ కోటయ్య, నందిగామ ఆనంద్, పులి నరసింహారావు, బాబు, బుచ్చారావుహుస్సేన్ పాల్గొన్నారు.

వాయిలసింగవరం వీవోఏగా కల్యాణి

అనంతగిరి: మండంలోని వాయిలసింగవరం గ్రామంలో సంఘం బంధం-1 సమావేశాన్ని బుర్ర కల్యాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన స్వయం ఉపాధి సభ్యులు పోతురాజు కల్యాణిని వీవోఏగా ఎన్నుకున్నట్లు ఏపీఎం లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కృష్ణవేణి పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు భూములు కాపాడాలి

హుజూర్‌నగర్: వక్ఫ్‌బోర్డు భూములను కాపాడాలని టీపీసీసీ కార్యదర్శి అజీజ్‌పాషా కోరారు. మంగళవారం హైదరాబాద్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లాహుస్సేన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మద్దిరాల: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లుయాదవ్ అన్నారు. మంగళవారం మండలంలెపి కుక్కడం గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. రైతులకు రుణమాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. ఈ సమావేశంలో నాయకులు పచ్చిపాల వెంకన్న, వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, భిక్షపతి, అమృతమల్లు, దగ్గుల మల్లయ్య, సౌడ శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, కంట్లం, శ్యాంరెడ్డి పాల్గొన్నారు.

సర్వే పేరుతో ఇంటి పన్ను వసూలు చేయడం తగదు

నూతన్‌కల్: ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పేరుతో గ్రామాల్లో ఇళ్ల సర్వే చేస్తూ ఇంటి పన్ను వసూలు చేయడం తగదని బీఆర్ఎస్ మండల నాయకుడు బత్తుల విద్యాసాగర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఇళ్ల కోసం ప్రజలకు గ్రామాలకు వస్తే వారి నుంచి అధికారులు బలవంతంగా ఇంటి పన్ను వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి ఒక్కరి ఇంటినీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు.

నియోజకవర్గ గౌడ ఉద్యోగ సంఘం ఎన్నిక

హుజూర్‌నగర్: పట్టణంలోని కౌండిన్య ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా తుమ్మల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా బెల్లంకొండ రామచందర్, కార్యదర్శిగా మొక్కా రమేష్, కోశాధికారిగా పెండెం రాంబాబు, ఉపాధ్యక్షులుగా సైదులు, కృష్ణమూర్తి, అసోసియేట్ అధ్యక్షుడిగా పుల్లయ్య, సహాయకార్యదర్శులుగా సత్యానారాయణ, హుస్సేన్, హైమావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా మురళి, నాగమణి తదితరులను ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిలర్లుగా కుక్కడపు సైదులు, సత్యనారాయణ, రాంబాబు, బూర వెంకటేశ్వర్లు, గోవిందయ్య, అనిల్, శ్రీనివాస్, వీరస్వామి, లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని అన్నారు.